కథా నిలయం
శ్రీకాకుళం

# బార్ తం

"ఇదిగోండి గొలుసు, మూడు సవర్లు పెట్టి చేయించాం. అంటే ఇరవైనాలుగు గ్రాములు. ఎంత పాత బంగారం కింద లెక్క గట్టినా దగ్గర దగ్గర ఎనిమిదివేలదాకా రావాలి. తూకం అదీ జాగ్రత్తగా చూడండి" హెచ్చరింపుగా చెప్పింది భావన.

"అలాగే లేవోయ్.. అన్నీ చిన్నపిల్లలకి చెప్పినట్లు చెప్తావ్. ఆ విషయాలన్నీ నే చూసుకుంటాగా" అంటూ గొలుసు చొక్కా జేబులో వేసుకున్నాడు బానుమూర్తి.

"పెద్దదానికి కంప్యూటర్ క్లాసికి ఫీజు మూడువేల అయిదు వందలట. పిల్లవాడి కాన్వెంటుకు టరమ్‌ఫీజు రెండువేలు కట్టాలి. పోయిన నెలకి, ఈ నెలకి పాలవాడికి ఇవ్వాల్సిన పదిహేను వందలూ ఇచ్చేస్తే ఓ వెయ్యి రూపాయలు చేతిలో వుంటయ్. వదినా వాళ్లు వస్తారుగా... ఆమెకి, పిల్లలకి బట్టలు తేవటానికి సరిపుచ్చుకుందాం..." బడ్జెట్ చెప్పిందామె.

"భలేదానివే! ఇంకా డబ్బు చేతికిరానేలేదు. అప్పుడే అంతా ఖర్చుపెట్టేశావ్ కదా..." అని బయటకు నడిచాడు భానుమూర్తి.

"డబ్బు తీసుకుని నేరుగా ఇంటికి వచ్చేయండి" భయం భయంగా చెప్పింది భావన.

ఓసారలా ఆమె ముఖంలోకి చూసి రోడ్డుమీదకు చేరేడు భానుమూర్తి. పిల్లల స్కూలు ఫీజులు, పాలవాని బకాయిపోగా మిగిలిన వెయ్యిరూపాయల్లూ భానుమూర్తి మనసులో వేరేవేరే కోరికలు కలుగజేయసాగినై. ఉత్సాహం, ఉల్లాసం చోటుచేసుకోసాగినై.

'ఛీ... ఛీ... ఈసారలా చేస్తే భావన అసహ్యించుకుంటుంది. భోరున ఏడుస్తుంది... వద్దు వద్దు' అంతరాత్మ ఆక్రోశించసాగింది. బుద్ధి వద్దనే

వారిస్తోంది. అయితే ఏం ప్రయోజనం... ఎక్కడ్నుంచి ఊడిపడ్డాడో...శకుని ప్రవేశించాడు, భానుమూర్తి మదిలో.

'ఓరి పిచ్చివాడా...ఎన్నాళ్లు పోయినా భార్యాబిడ్డలంటూ, వాళ్లకోసం ఎందుకురా పరితపిస్తావ్... గో అండ్ ఎంజాయ్. 'ఈ మాయామేయజగంబె నిత్యమని సంభావించి, నా ఇల్లాలని, నా కుమారుండని ఎంతో అల్లాడిన ఈ శరీరంబూ...' అంటూ ఆక్రోశించాడు హరిశ్చంద్రుడు... మరిచావా..ఇల్లు, పెళ్లాం, పిల్లలు, పరీక్షలు, ఫీజులు, ఆసుపత్రులు, మందులు, ఎప్పుడూ వుండేదేనోయ్ భానుమూర్తీ ఈ లంపటం.

వదిలించుకో, హాయిగా అనుభవించు, మొదటి పెగ్గులో మజా అనుభవించు, మలి పెగ్గుల్లో నిషా అనుభవించు అయినా ఈ వయసులో కాకపోతే ఇంకెప్పుడు నీకీ సరదాలూ, తమాషాలూ' పోరు పెట్టసాగేడు శకుని.

'అవున్నిజమే..ఆయన చెప్పిందే రైట్. ఎన్నిరకాలుగా ఎంతచేసినా ఎన్నిపెట్టినా ఎవరికి తృప్తి వుంటుంది. ఎవరెవరికోసమో నా సంతోషాన్ని త్యాగం చేయాల్సిన అవసరం ఏమిటి?' అనుకున్న భానుమూర్తి, మరు నిమిషంలోనే...

'ఛ...ఛ.. ఆ డబ్బుతో పిల్లలకు కొత్త బట్టలు కొనుక్కువెళ్తే ఆసందపడ్తారు. కాకపోతే ఓ మంచి మిక్సీ కొనుక్కుని తీసుకెళ్తే, రోలు, పత్రంతో అవస్థపడే భావన ముఖం కళకళలాడిపోతుంది.... అంతే.... మందూ వద్దూ, సోడా వద్దు'అని అనుకున్నాడు.

అయినా వదుల్తాడా శకుని. శని పట్టుకుంటే ఏడేళ్లకయినా వదుల్తాడు కానీ శకుని పట్టుకుంటే జీవితాంతం వెన్నంటి వేటాడి వేధిస్తూనే వుండడూ?

'చాల్లే ఊరుకోవయ్యా పిచ్చి భానుమూర్తీ... ఇప్పటి వరకు నువ్వు ఎన్ని లక్షలు సంపాదించివుంటావ్. ఒక్క రూపాయన్నా దాచావా? ఈ సంసార సముద్రానికి అంతెక్కడుందయ్యా. అదొక ఊబి. అందులో పడ్డాక కూరుకుపోవటమే తప్ప తేలటం వుంటుందా'

'అయినా డబ్బంతా నిన్నే ఖర్చుపెట్టుకోమనటం లేదే! మొత్తంలో కొంత... అంతేగా అయినా జీవితం అన్న తర్వాత ఆ మాత్రం ఖుషీ లేకపోతే ఎలాగయ్యా. నీకో అయిడియా చెప్పనా?

మీ అమ్మాయికి కంప్యూటర్ క్లాసుకు కట్టవలసిన మూడువేలా అయిదువందలగ్గానూ మూడువేలే కట్టు. అయిదువందలూ ఓ నెలలో సర్దుతానని చెప్పు. కాదంటాడా. ప్రయివేటు కాలేజీకే కదా! ఆ ఆమాత్రం

సర్దుబాట్లు వుండకపోతయ్యా. వెళ్లు వెళ్లు గొలుసు అమ్మి, వచ్చిన డబ్బుతో జల్సాగా బార్లో దూరిపో...

నీ శరీరానికేకాదు... మనసుక్కూడా కాస్త విశ్రాంతి కావాలి సోదరా.. నా మాట విను. నీ కోసం, నీ ఆనందం కోసం చెప్తున్న మాటలేగానీ... నిజానికి నువ్ తాగితే నాకేమన్నా నిషా ఎక్కుతుందా చెప్పు.... ఇందులో నా స్వార్థం లేశమాత్రం కూడా కాదంటే నమ్ము. సాటి మగవాడివని జాలిపడి, తోచిన సలహా ఇస్తున్నాను. విన్నావా ఆనందోబ్రహ్మ... లేకుంటే సంసారం ఒక చదరంగం... ఆనక నీ ఇష్టం'

అంతే. భానుమూర్తిలోని సంశయాలన్నీ తొలగిపోయినై. శ్రేయోభిలాషిలా తోచాడు శకుని. అందుకే అతడు సూచించిన మార్గంవైపే మొగ్గుచూపేడు. బంగారం కొట్టునుంచి బంగళాలాంటి ఓ బ్రహ్మాండమైన బార్‌లోకి దారితీశాడు భానుమూర్తి.

అప్పుడతనికి భార్య భావనా గుర్తురాలేదు, పిల్లలూ గుర్తుకురాలేదు. రెండురోజుల క్రితం ఇంటికి వచ్చి పోట్లాడిన పాలవాడు అసలే స్ఫృహలోలేదు. విస్కీసీసాలు, గాజుగ్లాసులు కన్పించసాగేయి.

ఏ మూలనో దాగి ఉన్న కాస్తంత వివేకం శకుని చేతి కర్ర కింద బలవంతానా అణిగిపోతూ నోరు మెదపలేకపోతున్నది. గో అండ్ ఎంజాయ్ అంటూ చిరునవ్వుతో ప్రోత్సహిస్తున్న శకుని మాటల్తో మరింత ఉల్లాసంగా ఓ టేబుల్ ముందున్న కుషన్ కుర్చీలో ఆసీనుడయ్యాడు భానుమూర్తి.

తనకి అత్యంత ప్రీతిపాత్రమైన, అతి ఖరీదయిన బ్రాండ్ విస్కీ ఆర్డర్ చేసిన భానుమూర్తి అప్పుడే ఓ రౌండ్ పూర్తి కూడా చేశాడు. రెండో రౌండ్‌కు మరో పెగ్ ఆర్డర్ ఇచ్చాడు అంతలో -

"ఎక్స్యూజ్‌మీ" అని వినపడటంతో వెనుతిరిగేడు.

"మేచెస్ వుందా" నవ్వుతూ అడిగాడా వ్యక్తి.

"ఓ యస్... తీసుకోండి" అంటూ జేబులో ఉన్న అగ్గిపెట్టె అతనికి అందించాడు.

"అవునూ మీరూ ఒక్కరేగా... ఇలా రండి....లెటజ్ డిస్కస్ సంథింగ్" అని బలవంతం చేశాడు.

అతనిమాట కాదన్లేక తన టేబుల్‌పై ఉన్న గ్లాసు చేత పుచ్చుకుని వచ్చాడతడు.

"బైదిబై మైనేమ్ ఈజ్ భానుమూర్తి అండ్ అయామ్.." అని స్వపరిచయం కానిచ్చాడు.

అతగాడు కూడా తనని గురించి చెప్పి షేకెండ్ ఇచ్చాడు.

'అరె మీకూ మందు అయిపోయిందిగా.. ఆ కాస్తా కానిచ్చేయండి... మరో రౌండ్ మొదలుపెడదాం" అతని సమాధానం పట్టించుకోకుండానే బేరర్‌ని పిలిచాడు భానుమూర్తి. అవును మరి ఇప్పుడు అతన్లో కర్ణుడు ప్రవేశించాడు.

"అబ్బే నాకు ఇంక వద్దండి" అన్నాడు అతడు.

"హేవిట్ సర్... హేవిట్... ఉయార్ ఫ్రెండ్స్ ఫ్రమ్ రైట్ నౌ..టేక్ దిస్ సిగరెట్ ఫస్ట్" అంటూ జేబులో ఉన్న సిగరెట్ పెట్టె బయటకు తీసి అతనికి ఒకటి అందించాడు.

అగ్గిపెట్టె, సిగరెట్ పెట్టే టేబుల్‌పైనే వుంచాడు మూర్తి. రెండు గ్లాసుల్లో రెండు పెగ్గులు తెచ్చాడు బేరర్.

"చూడు బాబూ ఓ.." అంటూ ఖరీదైన ఓ నాన్‌వెజ్ అయిటమ్ ఆర్డరిచ్చాడు భానుమూర్తి. అంతటితో ఆగలేదు. ఆగితే కర్ణుడెలా అవుతాడు. "మీరేంటిసార్.. వెజ్జా...నాన్‌వెజ్జా" అడిగేడతన్ని.

"అబ్బే... నాకేం వద్దండి" అసౌకర్యంగా అన్నాడతను.

"మీరలా ప్రతిదానికి ముఖమాటపడితే నాకు భాగుండదు. ఏం చెప్పమంటారు..."

* * * *

"సరే... నేనే చెప్పేస్తున్నాను..." అని బేరర్ వైపు చూసి ఓ వెజిటబుల్ కట్‌లెట్ తీసుకురావోయ్..అలాగే ఆయనకో సోడా, నాకో థంమ్సప్ ... త్వరగా" అంటూ బేరర్ని పురమాయించాడు.

"ఏమున్నది సార్ లైఫ్...ఉయ్ హేవ్ టు ఎంజాయ్ ఇట్.... దట్సాల్... నా పాలసీ అంతే" అని బిగ్గరగా నవ్వేడు భానుమూర్తి.

ఇద్దరూ గ్లాసులు ఎత్తారు.

కాసేపు రాజకీయాల గురించి మాట్లాడుకున్నారు. మరి కాసేపు పిల్లల చదువులు, పుస్తకాల గురించి విశాల హృదయంతో చర్చించుకున్నారు.

"సిగరెట్ తీసుకోండిసార్... మీరేం సంకోచించకండి. మీదేంటి, నాదేంటి.. ఒక్క మాట చెప్పనా... అసలు పుట్టేటప్పుడు ఏం కట్టుకువచ్చాం, పోయేటప్పుడు ఏం తీసుకువెళ్తాం... చెప్పండి" అని తెరచిన సిగరెట్ పేకెట్ అతని ముందుకు నెట్టేడు. మరికాసేపు సివిక్ సెన్స్ గురించి కబుర్లాడుకుంటూ రెండవ రౌండ్ ముగించారు.

మూడవ రౌండ్‌కు ఆర్డర్ ఇవ్వటమూ, మళ్లీ రెండు గ్లాసులూ నిండటమూ జరిగిపోయినై.

రెండో రౌండ్ పూర్తి అయ్యాక దుర్యోధనుడు ప్రవేశించాడు భానుమూర్తిలో, అహంకారం, ఆవేశం, మూర్ఖత్వం, మొండితనం... వగైరాలు చోటుచేసుకున్నయ్... మూడో రౌండ్‌లో మూడు సిప్‌లు పూర్తయ్యాక వచ్చిన బేరర్ వంక కోపంగా చూశాడు భానుమూర్తి.

"హలో ... ఎంతసేపయింది ఆర్డిరిచ్చి..."

"కొంచెం ఆలస్యం అయింది. సారీ సార్" అంటూ వినయంగా బదులిచ్చాడు బేరర్.

"ఆలస్యం అవుతుందీ... అని ముందర చెప్పాలయ్యా... అయినా, ఇష్టమయితే ఆర్డరిస్తాం...లేకపోతేలేదు... పోనీ మధ్యలోనైనా వచ్చి ఓ అయిదు నిమిషాలు ఆగండిసార్.. ఆలస్యం ఉంది అని చెప్పేవా..ఆఁ..చెప్పేవా? కర్టెసీ వుండాలయ్యా... కర్టెసీ వుండాలి... ఇంత పెద్ద బిల్డింగ్ చూసి లోపలికి రాలేదయ్యా మేము, సర్వీస్...సర్వీస్ బాగుంటుందని వచ్చాం... అండర్‌స్టాండ్.. అండర్‌స్టాండ్ వాటైసే?" అంటూ పళ్లు పటపటలాడించాడు.

"సారీ సార్... ఆర్డర్ తీసుకురమ్మంటారా...వద్దా" అడిగేడు బేరర్. అతడి కాలర్ పుచ్చుకుని ఊపేశాడు. భానుమూర్తి. ఎదురుగా కూర్చున్న వ్యక్తి, మరో ఇద్దరు బేరర్స్ సర్దిచెప్పి కూచోపెట్టారు.

''యూ స్టుపిడ్..డూయూనో హూయాంవై? నీ అంతు చూస్తానేమనుకుంటున్నావో... అంతుసూస్తా" ఆవేశంగా అరుస్తూ రొప్పుతూ, అంత ఆవేశంలోనూ గ్లాసెత్తి గటగటాగ్లాసులో ఉన్న మందంతా తాగేసి పెద్దగా శబ్దంచేస్తూ గ్లాసుటేబుల్‌పైన వుంచాడు భానుమూర్తి.

ఎదుటివ్యక్తివద్దని వారిస్తున్నా వినకుండా మరోరౌండ్‌కు ఆర్డరిచ్చాడు. తినటానికి తెప్పించుకున్న రెండుప్లేట్లూ ఖాళీ అయినై. మరో రెండు రకాలు తెమ్మని చెప్పేడు. సిగరెట్ అయిపోగానే సిగరెట్ తీసి వెలిగించసాగేడు. ఏం తాగుతున్నాడో ఏం తింటున్నాడో అర్థం అవుతున్నట్లులేదు అతని వాలకం.

మూడో రౌండ్ కూడా పూర్తయ్యేసరికి భానుమూర్తి కళ్లు కాస్తంత మసకబారినట్లుగా అనిపించసాగినై అతని మనసంతా ఆడవారితోనిండి పోయింది. తనకి ఎవరెవరి మీద కోరిక వుందో... వాళ్లంతా కళ్లముందు కదలాడసాగేరు. అవును మరి భానుమూర్తిలో ఇప్పుడు దుశ్శాసనుడు ప్రవేశించాడు. ఆడ మనిషికాదు, కేలండర్ కనిపించినా కసెక్కిపోయేటంత

కామం అతన్లో, నరాలన్నీ జివ్వుమంటున్నాయి. ఆడదాని పొందుకోసం అతని తనువు తహతహలాడసాగింది.

"ఇక బయల్దేరుదాం సార్" అని జేబులోంచి కొంత డబ్బు తీయబోతున్న ఆ వ్యక్తిని వద్దని వారించి బిల్లు మొత్తం తనే చెల్లించాడు భానుమూర్తి. బార్‌లోంచి బయటకు వచ్చాక "గుడ్‌నైట్" చెప్పి స్కూటర్ తీసుకుని వెళ్ళిపోయాడు అతగాడు. ఒంటరిగా మిగిలిన భానుమూర్తికి దూరం నుంచి వస్తున్న ఓ ఆకారం కనిపించింది. అదీ ఆడ ఆకారం కావటంతో కళ్లు చికిలించి మరీ చూసిన భానుమూర్తిలో ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. అడుగులు తడబడుతుండగా అటుగా నడిచాడు.

ఆమెను సమీపించి అవాకులు, చవాకులు పేలాడు. ఆమె చేయి పుచ్చుకోబోయాడు. లాగి ఒక్కటిచ్చుకున్నది ఆవిడ. ఆ తర్వాత ఏమైందో తెలియదు భానుమూర్తికి. తెల్లవారబోయే ముందు కళ్లు తెరిచిన భానుమూర్తి కటకటాల వెనక వుండేసరికి కళ్లుబైర్లుకమ్మినై.

జరిగింది ఏమిటో మొదట్నుంచీ లీలగా గుర్తుకు రాసాగింది. అంతే. సిగ్గుతో చితికిపోయాడు. సరిగ్గా ఆ సమయంలోనే మిత్రుడు ప్రభాకర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. తనను విడిపించుకు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకువచ్చాడు. మౌనంగా అతని వెనకాలే నడిచి బయటపడ్డాడు భానుమూర్తి.

"ఎన్నిసార్లు చెప్పినా ఇంక జీవితంలో నువ్వుమారవా" కోపంగా అడిగేడు ప్రభాకర్.

"... ... ..."

"నీకు చాలా సార్లు చెప్పేను. నా మాటలు నీ ప్రవర్తన మీద కొంతకాలమే పనిచేస్తున్నాయ్. ఆ తర్వాత నువ్వు మామూలుగా ఆ దుష్టచతుష్టయానికే దొరికిపోతున్నావ్ మందు తాగిన ప్రతిసారీ నీలో...

నీలానే చాలామందిలో... ఆ దుష్టచతుష్టయం రకరకాల స్టేజీల్లో ప్రభావితం చేస్తున్నారు... గమనించు. ఇకనైనా గ్రహించి నీ మనసును నువ్వు నిగ్రహించుకో" అని హితవు చెప్తున్న ప్రభాకర్ ఇప్పుడు భానుమూర్తికి అచ్చం శ్రీకృష్ణుడిలా కన్పించసాగేడు.

భానుమూర్తి భవిష్యత్తులో తన బాటను, బాణీనీ మార్చుకున్నదీ లేనిదీ...

◆ స్వాతి సపరివారపత్రిక - 25.2.2000 ◆